
# ఉగాది



ధర్మప్రచార పరిషత్తు
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# ఉగాది

రచన

**విద్వాన్, డాక్టర్ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య**

కార్యదర్శి, ధర్మప్రచారపరిషత్, తి.తి.దేవస్థానములు

★ ★ ★

"యుగాదిపర్వరూపాయ నమ స్సంవత్సరాత్మనే ।
కృపారసప్రపూర్ణాయ సప్తాద్రిపతయే నమః" ॥

★ ★ ★

ప్రచురణ

**ధర్మప్రచార పరిషత్**

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి - 517 501**

# ఉగాది


ప్రథమముద్రణ : 2,00,000


మార్చి - 2006

అమూల్యము

ప్రచురణ:
**ధర్మప్రచారపరిషత్**
**తిరుమల తిరుపతి దేవస్థానములు**
**తిరుపతి - 517 501**

ముద్రణ :
**స్టూడెంట్స్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్**
**553, బాలాజీ కాలనీ, తిరుపతి**
**ఫోన్ : 0877-2260253**





ఓం నమో వేంకటేశాయః

# ముందుమాట

తిరుమల తిరుపతి దేవస్థానమువారు ధర్మప్రచార పరిషత్తు ద్వారా అనేక ధార్మిక, ఆధ్మాతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ప్రజలకు ధార్మిక ఆధ్మాత్మిక చింతన చేకూర్చే సాహిత్యాన్ని ఉచితంగా 'పుస్తక ప్రసాద' రూపంలో ఇస్తున్నారు. ఈ సంవత్సరం విశేషించి, ఆయా పర్వదినాల ప్రాశస్త్యాన్నీ, తిరుమలలో జరిగే ఆనాటి విశేషోత్సవపరమార్థాన్నీ వివరిస్తూ సామాన్యప్రజలు కూడా చదివి, ఆనందించే విధంగానూ, ఆచరించే విధంగానూ చిన్నపుస్తకాలు ముద్రించి, భక్తులకు అందిస్తున్న సంగతి – ఇప్పటికే అందుకొన్న సాహిత్యం ద్వారా గ్రహించి వుంటారు.

ఈకోవలోనే చాంద్రమానంరీత్యా మనం జరుపుకొనే "ఉగాది" పండుగ ప్రాశస్త్యాన్నీ, ఆచరించే విధానాన్నీ, వేపపచ్చడిలోని ఆరోగ్యగుణాలనూ, తిరుమలలో ఆనాడు జరిగే శ్రీవారి అస్థాన విశేషాలనూ వివరిస్తూ ఈ చిన్ని పుస్తకాన్ని భక్తులకు అందిస్తున్నాము.

ఏ పండుగనైనా తెలసి ఆచరించడం ముఖ్యం! తెలుగువారికి ఆనందదాయకమైన పండుగల్లో ఉగాది మొదటి పండుగ. వసంతనవరాత్రుల్లో మొదటి రోజు పండుగ ఇదే! ఇది 'సంవత్సరాది' కావడంతో ఈ పండుగనాటి ఆనందోత్సాహాలు – ఆ సంవత్సరమంతా కొనసాగాలనే ఆకాంక్షకు పునాది–ఉగాదికదా!

ప్రకృతిలో సహజంగానున్న షడ్రుచుల్తో – వేపపూత పచ్చడిని ఉగాదినాడు భగవంతునికి నివేదించి, ప్రసాదంగా స్వీకరిస్తాము. ఆరోగ్యాన్ని ప్రసాదించే ఓషధుల్లో 'వేప' చాలా శక్తిమంతమైనది. ఒకప్పుడు ప్రతియింటి ముంగిట వేపచెట్లు తప్పక వుండేవి. వేప చెట్టుగాలి ఇంట్లో ప్రవేశించడం వల్ల వ్యాధికారక సూక్ష్మ జీవులు నశిస్తాయి. మశూచి మొదలైన వ్యాధుల్ని వేప నిరోధిస్తుంది.

మనం ఆచరించే ప్రతిపండుగలోనూ, ఆనాడు స్వీకరించే పదార్థాల్లోనూ ఆరోగ్య, అధ్యాత్మిక, వైజ్ఞానికాంశాలు ఎన్నో దాగి వున్నాయి. నిష్కారణంగా, నిష్ప్రయోజనంగా మనపూర్వులు ఈ పండుగలను

ఏర్పాటు చేయరుకదా! కనుక అందలి ఆంతర్యాన్ని గ్రహించి, ఆచరించడంవల్ల ఇతోధికప్రయోజనం. ఆనందం లభిస్తాయి. ఈ "ఉగాది ప్రసాదాన్ని" సిద్ధం చేసిన ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్యగారిని అభినందిస్తున్నాము.

ఈ కృషిలో భాగంగా ప్రస్తుతం 'ఉగాది' పుస్తక ప్రసాదాన్ని భక్తులకు అందిస్తున్నాము. అందరూ స్వీకరించి, చదివి ఆనందించి, సంవత్సరాదినాడు శ్రీపద్మావతీ శ్రీనివాసుల కృపాపాత్రులై, సంవత్సర పర్యంతమే గాక - సర్వదా ఆనందోత్సాహాలతో, అభ్యుదయ జ్ఞానవిజ్ఞానసంపదలతో వర్ధిల్లా లని ఆశిస్తూ - వర్ధిల్లజేయా లని శ్రీవారిని ప్రార్థిస్తూ.....

సదా శ్రీవారి సేవలో

**ఏ.పి.వి.ఎన్. శర్మ**

ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తి.తి. దేవస్థానములు

తిరుపతి

13-03-2006

"సర్వేజనా స్సుఖినో భవంతు"

# వసంతాంజలి

శ్రీమన్నారాయణుని ఆజ్ఞతో కాలం ప్రవర్తిస్తూంది. స్వామి చేతిలోని చక్రాయుధం కాలచక్రమే! “నేనే కాల స్వరూపుణ్ణి” అని గీతలో స్వామి పేర్కొన్నాడుకదా! చాంద్రమానం రీత్యా సంవత్సరాత్మకమైన కాలం వసంత ఋతువుతో ఆరంభమవుతుంది. “ఋతువుల్లో వసంతఋతువు నేనే” అని గీతాచార్యుని దివ్యవాక్కు! ‘ఉగాది’తో వసంతం ప్రారంభమవుతుంది. చెట్లన్నీ పూలతో, కాయలతో, పండ్లతో శోభిస్తూ – ‘మా జీవితమంతా మానవ మాధవసేవకే’ అంటూ ఆహ్వానిస్తుంటాయి. కనుకనే వసంతఋతువును కుసుమాకర మనీ, మధుమాస మనీ, మాధవ మనీ పెద్దలు పేర్కొన్నారు.

మధురానందనిలయమైన మాధవఋతువు ఉగాది పర్వదినంగా రూపొంది, తెలుగువారి ఆరాధ్యదైవమైన తిరుమల శ్రీవారిఆస్థానంతో ఆనందనిలయుణ్ణి సార్థక నామధేయుణ్ణి చేస్తూంది.

శ్రీవారిధార్మికసేవకై రూపొందిన ధర్మప్రచారపరిషత్తు – దాదాపు 36 వసంతాలు చూచింది. ఉగాది పండుగతో ఆనందించింది. ధర్మం నిత్యవసంతం కనుక ‘పరిషత్తు’కూడా నిత్యవసంత శోభల్తో ప్రకాశిస్తూనే వుంటుంది.

తి.తి.దేవస్థాన కార్యనిర్వహణాధికారి గౌరవ శ్రీ ఏ.పి.వి.ఎన్. శర్మగారి ఆదేశాన్ని - శ్రీవారిఆజ్ఞగా శిరసావహించి ఆయా పర్వదినాల విశేషాలను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో చిన్న పుస్తకాలుగా అందించే కార్యక్రమాన్ని ప్రారంభించి, 'శ్రావణపూర్ణిమ' నుండి 'మహాశివరాత్రి' వరకూ ఆచరించినాము. భక్తులూ స్వీకరించి ఆదరించారుకూడా!

ప్రస్తుతం తెలుగువారి తొలిపండుగ 'ఉగాది' విశేషాలను ఈ రూపంలో అందించే మహాభాగ్యం లభించింది. ఈ విధమైన రచనాసేవ లభించడం బహుజన్మ పుణ్యఫలం. ఇది నిజంగా భగవద్భాగవతసేవయే! 'దొరకునా యిటువంటిసేవ'?

అన్ని పండుగలనూ వివరిస్తూ - ఒకే పెద్ద పుస్తకంగా వచ్చినవి ఎన్నో వున్నాయి. కానీ సులువుగా అర్థం చేసుకోవడానికీ, చేతిలో వుంచుకోవడానికీ, అనుకూలంగా వుంటాయని ఇలా ఒక్కొక్కపండుగనూ వివరించే ఒక్కొక్క చిన్న పుస్తకాన్ని ముద్రిస్తూంది - ధర్మప్రచారపరిషత్తు. పాఠకభక్తుల ఆదరాభిమానాలే ఈ పుస్తకసమారాధనకు అమృతఫలాలు.

ఇందులో తిరుమల శ్రీవారిసన్నిధిలో ఉగాది ఆస్థానం, ఉగాది పండుగ విశేషాలూ, ఆచరణ విధానం, ఉగాది పచ్చడి

– ఆరోగ్య పరిరక్షణ, వైజ్ఞానికాంశాలూ, ఆధ్యాత్మిక స్ఫూర్తి, పంచాంగశ్రవణం మున్నగు అంశాలు సంగ్రహంగా పేర్కొనడం జరిగింది. జిజ్ఞాసువులకు ఈ రచన 'కరదీపిక'గా ఉపయోగపడితే చాలు – మా కృషి సఫలమైనట్లే! ఆపై మరిన్ని విషయాలు పెద్దల ద్వారా తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తారు.

ఈ రచనలో ఎన్నో గ్రంథాలూ, వ్యాసాలూ ఉపకరించాయి. ఆయా రచయిత లందరికీ హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు.

ఈసేవకు నన్ను నియోగించిన సహృదయవరేణ్యులు గౌరవ శ్రీ ఏ.పి.వి.ఎన్.శర్మ – కార్యనిర్వహణాధికారిగారికి సంతతవసంతవినయాంజలులు.

అన్నిటికీ శ్రీహరియే మూలం కనుక ఇంతటికీ, ఇన్నిటికీ మూలమై, అండదండగా నిలిచి, అందర్నీ రక్షిస్తున్న శ్రీనివాసునికి అంజలించుటకంటే – మరొకసేవ ఏమున్నది? "ఎందరో మహానుభావులు– అందరికీ నతోనస్మి,

సదా శ్రీవారిధార్మికసేవలో

తిరుపతి

**పమిడికాల్వ చెంచుసుబ్బయ్య**

14-3-2006

కార్యదర్శి, ధర్మప్రచారపరిషత్
తి.తి. దేవస్థానములు

"ఓం నమో వేంకటేశాయ"

## తిరుమల - శ్రీవారి సన్నిధిలో

# "ఉగాది ఆస్థానం"

శ్రీవైకుంఠాన్ని వదలి, భక్తరక్షణకోసం భూలోకానికి వచ్చి, తెలుగు నేలలో తిరుమల క్షేత్రంలో స్వామిపుష్కరిణీ తీరంలో వెలసిన శ్రీహరి – తెలుగువారి ఇలువేల్పేగాక, విశ్వానికే తొలివేల్పుగా సేవలుకొంటున్నాడు – శ్రీవేంక టేశ్వరమూర్తిగా. శ్రీవేంకటేశ్వరస్వామి తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైన తెలుగు ఉగాదిని (సంవత్సరాది) మహా వైభవంగా – "ఉగాది ఆస్థానం" అనే పేర్తో చేసుకొని, తాను ఆనందిస్తూ, లోకాన్ని ఆనందమయం చేస్తున్నాడు. ఇదంతా నిజానికి భక్తులకొరకే! కాలమే తానైనవాడు స్వామి. తన ఆజ్ఞతో కాలాన్ని నడిపిస్తున్నాడు – మహావిష్ణువు. అట్టి విశ్వేశ్వరుడూ విశ్వమయుడూ అయిన శ్రీవారు 'ఉగాది ఆస్థానం' జరుపుకొనుట – భక్తుల ఆనందాన్ని చూచి, తాను ఆనందించుటగాక – స్వామికి మరో కోరిక ఏమున్నది?

తెలుగుఉగాది పండుగనుండే తిరుమలేశుని ఆలయ కార్యక్రమాలూ, ఉత్సవాలూ ప్రారంభమవుతాయి. అంటే శ్రీవారి సుప్రభాతసేవతో "ఉగాది" మొదలవు తుంది. ఉగాదినాడు సుప్రభాతం కాగానే, తోమాలసేవ జరుగుతుంది. (పిదప ప్రతిరోజూ మామూలుగా కొలువు శ్రీనివాసమూర్తికి జరిగే కొలువు జరుగదు) తోమాలసేవా నంతరం శ్రీభూదేవీసమేత శ్రీమలయప్పస్వామివారికీ (శ్రీవారి ఉత్సవమూర్తులు), సేనాధిపతి విష్వక్సేనులవారికీ ఏకాంతంగా తిరుమంజనం జరుగుతుంది.

తర్వాత బంగారువాకిలికి ముందున్న తిరుమహా మణిమండపం (ఘంటామండపం)లో, బంగారు వాకిలికి ఎదురుగా నున్న గరుడాళ్వారుకు అభిముఖంగా (ఎదు రుగా) బంగారు సర్వభూపాల వాహనంలో దేవేరులతో గూడా శ్రీమలయప్పస్వామివారిని వేంచేపుచేస్తారు. పట్టు వస్త్రాలతో, వజ్రమాణిక్యాదిసువర్ణాభరణాలతో, కిరీ టాలతో, సుగంధసుపుష్పమాలికలతో ఉత్సవమూర్తుల్ను విశేషంగా అలంకరిస్తారు.

శ్రీమలయప్పస్వామివారియెడమప్రక్కన మరొక పీఠంపై దక్షిణాభిముఖంగా శ్రీవారిసేనాపతి విష్వక్సేనుల వారినీ అలంకరించి, శిరస్త్రాణాన్నీ, ఖడ్గాన్నీ ధరించి, మిక్కిలి భయభక్తుల్తో శ్రీవారి ఆజ్ఞల్ని అమలుపరచడానికి సిద్ధంగా వున్నట్లుగా, వేంచేపుచేస్తారు. పిదప ఆనందనిలయంలోని మూలవిరాణ్మూర్తికీ, విశేషమైన పడిప్రసాదాలు, అన్నప్రసాదాలు నివేదిస్తారు.

శ్రీవారి అర్చకులూ, పెద్దజియ్యంగార్లు, చిన్నజియ్యం గార్లు, ఏకాంగులూ, ఆచార్యపురుషులూ, వేదపండితులూ, దేవస్థానం కార్యనిర్వాహకులూ, ఇతరఅధికారులూ, పేష్కార్లూ, పారుపత్యదారులూ - ఛత్ర చామరాలతో, మంగళవాద్యాలతో - వేదపఠనం జరుగు తుండగా - శ్రీవారి వంటవాళ్ళు విశేషవంటకాలను నివేదనకు ఊరేగింపుగా తెస్తారు. ఈ వంటకాలతో విమాన ప్రదక్షిణంలో బంగారుబావి ప్రక్కన నున్న వంటశాల నుండి ఉత్సవంగా బయలుదేరి, విమానప్రదక్షిణం చేసి, వెండివాకిలి యెదురుగా నున్న ధ్వజస్తంభానికి ప్రదక్షిణంగా వెళ్లి, లోపలికి వచ్చి, ఆలయప్రవేశం చేస్తారు.

మంగళవాద్యాలు బంగారు వాకిలివద్ద ఆగిపోగా, మిగిలినవారు సన్నిధిలో కొన్ని ప్రసాదాలనూ, బంగారు వాకిలివద్ద కొలువులో కొన్ని ప్రసాదాలనూ సమర్పిస్తారు. వెంటనే రెండు చోట్లా ఘంటానాదంతో విశేషనివేదన జరుగుతుంది.

పిదప శ్రీయోగనరసింహస్వామి ఆలయం ప్రక్కన నున్న 'పరిమళపు అర' దగ్గర నుండి పెద్ద-జియ్యంగారు పెద్ద వెండితట్టలో మడతపెట్టి, చుట్టగా చుట్టబడిన ఆరు పెద్దపట్టువస్త్రాలను తలమీద పెట్టుకొని, మంగళ వాద్యాలతో, వేదపారాయణలతో, దివిటీల దివ్యకాంతుల్లో దేవస్థానం అధికారులైన కార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు, ఇతర అధికారులూ, వెంటరాగా ధ్వజస్తంభానికి ప్రదక్షిణంగా వచ్చి, ఆనందనిలయ విమానానికి ప్రదక్షిణం చేస్తూ – బంగారువాకిలివద్దకు చేర్తారు. వాకిలిలోపల 'సన్నిధిగొల్ల' దివిటీతో – వీ రందర్నీ సన్నిధివరకూ పిల్చుకపోతాడు. శ్రీవారిసన్నిధిలో జియ్యంగార్లు తాము తెచ్చిన పట్టువస్త్రాలను అర్చక స్వాములకు అందిస్తారు. జియ్యంగార్లూ, ఏకాంగులూ

మాత్రమే ఆనందనిలయంలో (గర్భగుడిలో) ప్రవేశిస్తారు. వెంటనే తెరవేస్తారు.

లోపల అర్చకస్వాములు జియ్యంగారు సమర్పించిన ఆరు పట్టువస్త్రాల్లో నాల్గింటిని శ్రీవారిమూర్తికి అలంకరిస్తారు. ఒక వస్త్రాన్ని కిరీటానికీ, రెండవది నందక ఖడ్గానికీ, మూడవ దాన్ని ఆదితోమాలగానూ, నాల్గవదాన్ని ఉత్తరీయంగానూ అలంకరిస్తారు. తెరతొలగిన తర్వాత అర్చకస్వామి బంగారు పళ్ళెంతో పచ్చ కర్పూరహారతి ఇస్తారు. ఆ హారతిని ఏకాంగి అందరికీ చూపగా, అక్కడివా రందరూ కళ్ళకద్దుకొంటారు. సంప్రదాయానుగుణంగా తీర్థం, శఠారి, చందనం, తాంబూలం (మడుపు) లను అర్చకులు ఇస్తారు. తర్వాత కార్యనిర్వహణాధికారి గారికీ, ఇతరఅధికారులకూ తీర్థం, శఠారి మున్నగునవి యిస్తారు.

పిదప మిగిలిన రెండు పట్టువస్త్రా లున్న వెండితట్టను పెద్దజియ్యంగారు తలపై నిడుకొని తెచ్చి, బంగారు వాకిలివద్దనున్న ఉత్సవమూర్తులకు సమర్పిస్తారు. అర్చకస్వాములు ఒక వస్త్రాన్ని శ్రీమలయప్పస్వామికీ, మరొకదాన్ని విష్వక్సేనుల వారికి అలంకరిస్తారు.

ప్రధానార్చకులు తలకు శ్రీవారిపాదవస్త్రంతో పరివట్టం (తలకు చుట్టూ కట్టే చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని, శ్రీస్వామివారిపై, విష్వక్సేనులవారిపై అక్షతారోపణం చేస్తారు. పిదప విష్వక్సేనులవారికి పరివట్టంకట్టి, శ్రీస్వామివారికి వేసిన అక్షతలను గైకొని విష్వక్సేనుల వారిపై చల్లి, శఠారిమర్యాదలు జరుపుతారు.

పిదప ప్రధానార్చకులు శ్రీస్వామివారిద్వారా తండులదానం (బియ్యం), దక్షిణతాంబూలాలు స్వీకరించి, "నిత్యైశ్వర్యో భవ" (నిత్యమైన ఐశ్వర్యవంతుడవు కమ్ము)అని, స్వామివారిని ఆశీర్వదిస్తారు. అక్కడనున్న మరొక అర్చకులు ప్రధానార్చకులకు పరివట్టంకట్టి శఠారి మర్యాదలు చేస్తారు.

ఇలా ఆస్థానపూర్వరంగం జరిగాక, శ్రీవారికి ఆస్థానం జరుగుతుంది.

## ఉగాది ఆస్థానం

శ్రీస్వామివారి పాదపద్మాలమీదనున్న పంచాంగాన్ని భక్తితో స్వీకరించి, ఆస్థానసిద్ధాంతి శ్రీస్వామివారికి నూతన

పంచాంగ విశేషాలు విన్పిస్తారు. ప్రత్యేకంగా శ్రీవారి జన్మ నక్షత్రమైన 'శ్రవణం' ఫలితాలు వివరిస్తూ "ఓ స్వామీ! మీరు ఈ లోకంలో అవతరించింది - శ్రవణానక్షత్రం నాడు. ఈ సంవత్సరంలో మీరు విశేషదయాతరంగులై భక్తుల పాపాలను పొగొట్టి 'వేంకట'నామాన్ని సార్ధకం చేసుకొంటారు. భక్తులకు సకలసంపదలూ అనుగ్రహిస్తారు. కనుకనే భక్తకోటి ఈసంవత్సరంలో మీదర్శనానికై అఱ్ఱులు చాస్తూ, తిరుమలయాత్ర చేస్తారు. మీదయకై, ఆనందానికై ఎన్నో ఉత్సవాలు ఎంతో వైభవంగా భక్తితో నిర్వహిస్తారు. మీకు విశేషంగా ధనవస్తురూపంలో కానుకలు సమర్పిస్తారు. మీ ఆజ్ఞావర్తులైన నవగ్రహాలూ మీ భక్తుల్ని రక్షిస్తూంటారు. దేశం సస్యశ్యామలమై వర్ధిల్లుతుంది. మీదయవల్ల అతివృష్టి, అనావృష్టి, ఆధివ్యాధులూ లేక విశ్వం హాయిగా వుంటుంది" - అని విన్నవిస్తారు - సిద్ధాంతిగారు. ఆ సమయంలో శ్రీస్వామివారు అరమోడ్పుకన్నులతో, మందహాసంతో, సంతోషంతో వింటూ అందర్నీ దీవిస్తున్నట్లుగా దివ్యకాంతుల్తో సాక్షాత్కరిస్తారు.

శ్రీదేవీభూదేవులకు కూడా నక్షత్రఫలాలు చెప్పిన తర్వాత అక్కడ నున్న పెద్ద లెవరైనా తమ నక్షత్రఫలితాలు తెల్పం డని అర్థిస్తే – సిద్ధాంతిగారు వారినక్షత్రఫలితాలు విన్నిస్తారు. పిదప అర్చకస్వాములు సిద్ధాంతిగారికి శఠారిని అనుగ్రహిస్తారు.

పిదప జియ్యంగార్ల గుమాస్తా వచ్చి, ముందురోజు వచ్చిన హుండీరాబడినీ, ఆదాయవ్యయాలనూ, ఉత్సవవిశేషాలనూ స్వామివారికి విన్నిస్తారు. వెంటనే అర్చకస్వాములు శ్రీమలయప్పస్వామివారలకు "కొలువు పళ్లెం" అనబడే బంగారుతట్టలో నవనీతహారతిని జరిపి, కార్యనిర్వహణాధికారిగారికి నవనీతం (వెన్న) తాంబూలం ఇస్తారు. పిదప సర్కారు హారతులు కార్యనిర్వహణాధికారి మొదలు పారుపత్యదారువరకూ ఒక్కొక్కరికి ఒక్కొక్క హారతి క్రమంగా నిర్వహిస్తారు.

తరువాత మైసూరువారి, తాళ్ళపాకవారి, తరిగొండ వారి హారతులూ జరుగుతాయి. చివరగా భక్తులందరి తరఫున ఒక్కొక్క రూపాయివంతున సేకరించి "రూపాయహారతి" ఇస్తారు. పళ్ళెంలో వచ్చిన

రూపాయల్ను కార్యనిర్వహణాధికారి ఖజానాకు జమ చేస్తారు.

చివరగా జియ్యంగారికీ, పిదప దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారికీ పరివట్టం కట్టి, శఠారిని అనుగ్రహిస్తారు. పిదప ప్రసాదవినియోగం జరుగుతుంది. చందనతాంబూలాలూ, అక్షతలూకూడా ప్రసాదంతో పాటు ఇస్తారు.

ఇలా 'ఉగాది ఆస్థానం' పూర్తి అయ్యాక, భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఉగాదిరోజు కల్యాణోత్సవం మున్నగు ఆర్జితోత్సవసేవలు ఏవీ ఉండవు.

సాయంకాలం తిరుమల నాల్గుమాడవీథుల్లో శ్రీభూదేవీసమేతంగా శ్రీమలయప్పస్వామివారు ఉత్సవంగా వచ్చి, భక్తులకు నూతనసంవత్సర శుభాశీస్సులతో పాటు, దివ్యమంగళదర్శనంకూడ అనుగ్రహిస్తారు.

ఉగాదినాడు సాయంకాలం ప్రారంభమైన ఈ ఉత్సవం 40 రోజులు విధిగా జరుగుతుంది. దీన్ని "నిత్యోత్సవం" అంటారు. వైశాఖశుద్ధదశమివరకూ

ఈఉత్సవం ఆగమసంప్రదాయబద్ధంగా నిర్వహింప బడుతుంది. ("శ్రీనివాసవైభవం" నుండి గైకొన్నది).

## ఉగాది ఆస్థానం - ఆధ్యాత్మికానందస్థానం

శ్రీనివాసుడు ఉత్తమమైన వైకుంఠాన్ని వదలి, వేంకటాచలంపై పుష్కరిణీతీరంలో స్థిరనివాసి కావడం భక్తజనోద్ధరణకొరకే అనుట మనభావన.

భూ, భూమి – శబ్దాలకు 'నీళ్ళనుండి పుట్టింది' అని వ్యుత్పత్తి. శ్రీమన్నారాయణుడు 'నీటిని నివాసంగా గలవాడు'. కనుక భూమి (భూలోకం) స్వామినుండి యేర్పడిందే! పంచభూతాల, మనస్సూ, బుద్ధీ అహంకారమూ ఈ యెన్మిదీ స్వామివారి అష్టమూర్తులు. విశ్వమే విష్ణువూ, విష్ణువే విశ్వమూ కనుక – స్వామి భూలోకానికి రావడం తన 'భూమూర్తిని' చూచి, ఆనందించడానికే ! "సర్వంవాసుదేవమయం" కనుక ఇందున్న చరాచరాత్మకప్రకృతి అంతా తనమూర్తులే! "నర్తకునిభంగి పెక్కగుమూర్తులతో నెవ్వ డాడు?"నని భాగవతం శ్రీవారిబహురూపవైశిష్ట్యాన్ని కీర్తించింది.

"కాలః కలయతా మహమ్" - అని గీత! కాలం అన్నింటికంటే గొప్పదై, విశ్వంలోని అన్నింటినీ అణిచివేస్తుంది. గణించేదీ, ప్రేరేపించేదీ కాలం. "కదలదు నీదు సంకల్పములేనిదే గడ్డి పోచయును" కనుక విశ్వానికి ప్రేరణం, కారణం విష్ణువే! రూపంలేని అనంతకాలాన్ని భగవంతుణ్ణిగా భావించి, సంవత్సరాత్మకరూపంతో ఆరాధించడం - ఉగాది ఆస్థాన విశేషం. సర్వాలంకార భూషితుడై స్వామి కార్యకారణ శక్తులైన దేవేర్లతో ఆస్థానం చేయడం - తనసర్వాంతర్యామిత్వాన్నీ, సర్వశక్తినీ, భక్తరక్షణతత్పరతనూ నిరూపించడానికే! సేనాపతి విష్వక్సేనులవారూ - దక్షిణాభిముఖులై వుండటం మరో విశేషం! సర్వత్ర వ్యాపించిన సేనగలవాడు - విష్వక్సేనుడు. ఇతడు సేనాపతి. శ్రీస్వామివారికిని 'విష్వక్సేను'డని పేరుంది. శ్రీహరిసైన్యానికి అధిపతి శ్రీహరియేగాక మరొక్క రుందురా? కనుకనే ఇరువురూ ఒకరే! తానే సైన్యమూ, సైన్యాధిపతియునై వుంటాడు - స్వామి. దక్షిణాభిముఖుడై విష్వక్సేను డుండటం యమకింకరుల్ని పారద్రోలి, శ్రీవారిభక్తులకు మృత్యుభయం లేకుండా చేయడానికే!

అర్చకుడు సాక్షాత్తూ హరియే కనుక – భూలోకంలో శ్రవణానక్షత్రంలో అవతరించిన శ్రీవారికి పంచాంగాన్ని శ్రవణం చేయించడం –కాలస్వరూపాన్నీ, కాలప్రభావాన్నీ, కాలఫలాల్నీ వివరించడమే! శ్రీవారిని "నిత్యైశ్వర్యో భవ" అని ఆశీర్వదించుట – నిజానికి స్వామిని దీవించడం కాదు. ఇది శుభవాక్కు! స్వామ్ని నిత్యైశ్వర్యవంతుడై వుంటేనే – భక్తులనూ నిత్యైశ్వర్యవంతుల్ని చేస్తాడు. ఇది "విజయతాం" అనే మాట వంటిది.

పంచభూత, పంచప్రాణ, పంచేంద్రియాది పంచ తత్త్వాలకు సంకేతం పంచాంగం. ఇట్టి పంచాంగవిశే షాలు స్వామికి విన్పించడం ద్వారా మనలోని పంచతత్త్వా లను జాగృతంచేసి, చైతన్యవరచి మనల్ని కర్మ ధర్మోన్ముఖుల్ని జేయుటయే అవుతుంది. కాలస్వరూపుడైన స్వామిసన్నిధిలో కాలగణనాన్ని పేర్కొనడం, సంవత్సర ఫలితాలు వివరించడం – స్వామివారితత్త్వాన్ని కీర్తించడమే!

కాలమూ, విష్ణువూ వ్యాపించేగుణంకలవారే! సర్వమూ కాలాధీనమే! ఆ కాలం విష్ణుదేవునిఆజ్ఞతో

ప్రవర్తిస్తుంది కనుక సంవత్సరాదినాడు స్వామిని కాలస్వరూపుణ్ణిగా భావించి పూజించడంతో - స్వామి కృపవల్ల కాలం మనల్ని కనికరిస్తుంది. మన బుద్ధిని సత్కార్యాచరణకు ప్రేరేపిస్తుంది. ధీశక్తిని పెంచుతుంది. భగవద్భావన లేకుండా పంచాంగశ్రవణం చేసినందువల్ల తీపులేని పాయసంవలె వృథా అవుతుంది. పంచాంగానికి అధిష్ఠానదేవత శ్రీమన్నారాయణుడే!

శ్రీవారు వేంచేపుచేసే స్థలాన్నీ, కార్యక్రమాన్నీ ఆస్థాన మని పేర్కొంటారు. ఉగాదినాడు స్వామివారు వేంచేపు చేస్తారు కనుక ఆకార్యక్రమాన్ని 'ఉగాది ఆస్థానం' అన్నారు. సంవత్సరమంతా సంతోషంగా ఉండటానికి, ఆది=మొదలైనరోజు కనుక సంవత్సరాది 'ఉగాది' అయింది. ఉ=విష్ణువు, శివుడు. ఇర్వురూ భక్తరక్షణ కార్యాన్ని ప్రారంభించుటకు మొదలైనరోజు కనుక ఉగాది. హరిహరాభేదతత్త్వాన్ని సూచించే దవుతుంది.

తాను గావించిన సృష్టిని సంవత్సరప్రారంభంలో ఆస్థానమై కూర్చుండి, దయాదృష్టితో చూచి, తాను

ఆనందించి, విశ్వాన్ని ఆనందింపజేయడమే శ్రీవారు "ఉగాది ఆస్థానం" చేయడంలోని పరమార్థంగా భావించవచ్చు!

('ఉగాది'నాడు శ్రీవారిఆలయంలో జరిగే సేవా కార్యక్రమాల విశేషాలు శ్రీజూలకంటి బాలసుబ్రహ్మణ్యం గారు రచించిన "శ్రీనివాసవైభవం" పుస్తకంనుండి స్వీకరించినవి. (గ్రంథకర్తకు హార్దకృతజ్ఞతానమస్సులు)

## ఉగాది పండుగ

కాలాన్ని భగవద్రూపంగా భావిస్తే ప్రతిరోజూ, ప్రతి నిముషమూ పండుగే! ఆనందమే! ఇట్టి పవిత్రవిశాల భావన లేకుండా ఆచరించే పండుగలు దండుగలే అవుతాయి. పిండివంటలూ, మధురపదార్థాలూ తిని, రజస్తమోగుణాలు నింపుకోవడం తప్ప - సాత్త్విక ప్రవృత్తి లభించదు. కనుకనే మనపూర్వులు ప్రతిపండుగకూ ఒక అధిష్ఠానదైవం, పూజ, నియమాలూ, ఆహార విశేషాలూ ఏర్పాటు చేసినారు. పవిత్రభావంతో చేసే ప్రతి కార్యమూ ఇహపరానందదాయకమే అవుతుంది.

'ఉగాది' ప్రత్యేకించి – ఇతర వ్రతాలూ, పండుగల వలె ఏదో వొక దేవతను ఉద్దేశించి చేసేది కాదు. అనంతమైన కాలాన్ని – మన సౌలభ్యగణనం కోసం సంవత్సరాత్మకంగా లెక్కించి, సంవత్సరాదినాడు కాలాన్ని మనయిష్ట దైవస్వరూపంగానూ, సకలదేవతాస్వరూపం గానూ భావించి, సంవత్సరకాల భవిష్యత్తును ముందుగా తెలిసికొని ఆయాసమయాల్లో దైవానుగ్రహప్రాప్తికై చేయాల్సిన సాధనాలను సిద్ధపరచుకొనే ఒక చక్కని శాస్త్రీయప్రణాళికకు పూర్వరంగం ఏర్పరచుకోవడం – ఉగాది విశిష్టత.

కాలగణనంలో ఒకప్పుడు మార్గశిరంతోనూ, వైశాఖంతోనూ, కార్తికంతోనూ, ఆశ్వయుజంతోనూ – ఇలా అనేకవిధాలుగా సంవత్సరం ప్రారంభమైన విశేషాలు మనవాఙ్మయంలో కన్పిస్తున్నాయి. అట్లే యుగప్రారంభతిథి విషయంలోనూ కల్ప, మన్వంతరాది భేదాన్నిబట్టి తేడా లున్నాయి. నక్షత్రాల్నుకూడా యుగాదినక్షత్రాలుగా పేర్కొన్నారు.

వరహమిహిరాచార్యుని నిర్ణయాన్నిబట్టి, మనం చాంద్రమానం రీత్యా చైత్రమాసాన్నే సంవత్సరారంభంగా భావించి, చైత్ర శుక్ల ప్రతిపత్తు (పాడ్యమి) నాడు బ్రహ్మ సృష్టిని ప్రారంభించినా డన్న శాస్త్రవాక్కును ప్రమాణంగా గైకొని, దీన్నే 'యుగాది'గా గణించి, ఉగాది పండుగను ఆచరిస్తున్నాము. ప్రతి దేశంలోనివారూ, రాష్ట్రంలోనివారూ ఏదోవొక కాలగణనంతో ఉగాదిపండుగను తమ సంప్రదాయం ప్రకారం జరుపుకొంటూనే వున్నారు. ఆచరించే విధానంలో తేడా వున్నా - ఆశయంలో, ఆనందంలోమాత్రం తేడాలేదు.

తెలుగువారేకాక, కర్ణాటకులు, మహారాష్ట్రులు, చాంద్రమానాన్ని అనుసరించే మాళవీయులు మున్నగు వారునూ ఉగాదిపండుగను చైత్రశుక్లపాడ్యమినాడే ఆచరిస్తున్నారు. మనం జీవిస్తున్న ఈసృష్టి జరిగిన రోజును పండుగగా - మనం పుట్టినరోజును పండుగగా జరుపుకొంటున్నట్లుగా భావించి, ఈ ఉగాది పండుగను ఆనందంతో సంవత్సరంలో తొలిపండుగగా జరుపు కొంటున్నాము. జరుపుకోవాలికూడా!

సూర్యోదయానికి పాడ్యమి ఉన్న రోజునే (చైత్రశుక్ల పాడ్యమి) ఈ పండుగను ఆచరించాలి.

"చైత్రేమాసి" జగద్బ్రహ్మ ససర్జ ప్రథమేఽహని శుక్లపక్షే సమగ్రంతు తదా సూర్యోదయే సతి" - అని హేమాద్రి నిర్ణయం! కనుక చైత్రశుద్ధపాడ్యమి సంవత్సరాది. ఉదయానికి పాడ్యమి ఉండాలి. బ్రహ్మదేవుడు చైత్రశుద్ధపాడ్యమి, సూర్యోదయవేళ ఈ సృష్టిని సమగ్రంగా చేసినాడు. అందుకు కృతజ్ఞతాసూచకంగా, జ్ఞాపక చిహ్నంగా యుగాది పండుగ జరుపుకొంటున్నాము.

చైత్రశుద్ధపాడ్యమినాడు ఉపవాస ముండి, బ్రహ్మను పూజించినవారు సంవత్సరమంతా సుఖంగా వుంటారు. ఒకవేళ చైత్రం అధికమాసంగా వస్తే, అధికమాస ప్రారంభంనాడే ఉగాది జరుపుకోవాలి. అంతేకాని నిజచైత్రారంభంలో కాదు.

## ఆచరణ విధానం

తలంటుకొని స్నానం చేయాలి. క్రొత్త దుస్తులు ధరించాలి. ఇంటి ముంగిట తోరణాలు కట్టాలి. వేపపూత

పచ్చడి దేవునికి నివేదించి, స్వీకరించాలి. పూర్వులు సూచించిన ప్రకారమైతే - ఇందు 10 అంశాలున్నాయి. 1) ప్రతిగృహంలో ధ్వజారోహణం చేయాలి. 2) తైలా భ్యంగనం (నూగులనూనెతో తలంటుస్నానం చేయాలి. 3) నూతనవస్త్రాలు ధరించాలి 4) దమనంతో (దవనం) బ్రహ్మను పూజించాలి. 5) సర్వాపదలూ తొలగి, శాంత్యానందాల్తో జీవించుటకై 'మహాశాంతి' పూజా హోమాలు నిర్వహించాలి. 6) నింబకుసుమభక్షణం (వేపపూత పచ్చడి స్వీకరించాలి. 7) పంచాంగవిశేషాలు వినాలి 8) ప్రపాదానం ప్రారంభించాలి (చలివేంద్రం పెట్టించాలి). 9)రాజును దర్శించాలి. (జనవరి 1 నాడు ఉన్నతాధికారులను దర్శిస్తున్నట్లు). 10) వసంతనవరాత్ర పూజలు ప్రారంభించాలి. ఇందులో మనం కొన్ని మాత్రమే ఆచరిస్తున్నాము. ధ్వజారోహణం బదులు మామిడి, వేపతోరణాలు కడ్తున్నాము. ఆలయాల్లో, దేవతాది మందిరాల్లో అరటిస్తంభాలూ కడ్తున్నాము. తలంటు స్నానం, నూతనవస్త్రధారణం, పత్రపుష్పాలతో మన యిష్టదేవతలను పూజిస్తున్నాము. వేపపూత పచ్చడి

తీసుకొంటున్నాము. పంచాంగ శ్రవణం గావిస్తున్నాము. కొందరు చలివేంద్రాలు పెట్టిస్తున్నారు. రాజదర్శనం చేయకున్నా (రాజులూ– రాజ్యాలూ లేవు గనుక) పెద్దలకు నమస్కరించి, వారి ఆశీస్సులు పొందుతున్నాము. వసంత నవరాత్రములుగా శ్రీరామోత్సవాలు (గర్భజయంతులు) ఉగాది నుండి శ్రీరామనవమి దాకా జననజయంతులు శ్రీరామనవమినుండి తొమ్మిది రోజులు నిర్వహిస్తున్నాము. ఇలా ఏదో విధంగా ఉగాదినాడు శాస్త్రం పేర్కొన్న పది అంశాలూ మనం ఉగాది నాడు చాలావరకూ ఆచరిస్తూనే వున్నాము.

చైత్రశుక్లపాడ్యమినుండి పూర్ణిమవరకూ 15 రోజులూ ఆయా అధిష్ఠానదేవతానుగ్రహసిద్ధికై పండుగలూ, పూజలూ వున్నాయి.

వసంత, శరదృతువులు యమదంష్ట్ర లని జ్యోతిశ్శాస్త్రవచనం. మృత్యువు తాండవం చేసే రోజులు! కనుక అపమృత్యువువాతపడక, ఆయురారోగ్యాలతో వర్ధిల్లుటకై వసంతఋతుప్రారంభంలో విష్ణువునూ, (శ్రీరాముణ్ణీ) శరత్ప్రారంభంలో పరాశక్తి దుర్గనూ పూజించా లని పెద్దల

నిర్ణయం. రామానుగ్రహబల మున్నచో, నవగ్రహ బలం ఏమీచేయలేదు కదా!

చైత్ర, ఆశ్వయుజమాసప్రారంభంలో వాతా వరణంలో, ఉష్ణోగ్రతలో, ప్రకృతిలో జరిగే మార్పులే మృత్యువుకు కారణాలు. కనుక దేవతాపూజల నెపంతో ఆరోగ్యం, మనశ్శాంతి, ధైర్యోత్సాహాలు, భక్తిశ్రద్ధలూ, భవిష్యత్కార్యక్రమనిర్వహణపై పట్టుదల, అడ్డంకులు తొలగించుకోవాలనే కోరిక మున్నగునవి ఏర్పడి, మానవుడు జీవితాన్ని తీర్చిదిద్దుకొంటాడు. దీనికితోడూ చేసినపూజాఫలం వెన్నంటి వుంటుంది.

## తైలాభ్యంగనం

తలంటుకోవడానికి నూగులనూనెయే శ్రేష్ఠం. ఉగాదినాడు తలంటిస్నానం చేయనివారు నరకానికి పోతా రట! ఇలా అనడం విధిగా ఆనాడు మనం తైలాభ్యంగనం చేయా లని నిర్దేశించుటకే! తలంటుస్నానంవల్ల శరీరంలోని అన్నిఇంద్రియాలకూ పాటవం, చైతన్యం కల్గుతుంది. సుఖనిద్ర కల్గుతుంది. ఆరోగ్యపరంగా నూగులనూనెలో చాలామంచి గుణా లున్నాయి.

నూగులనూనె ఉష్ణాన్ని వెలికి తీస్తుంది. వాతాన్నీ, చర్మదోషాలనూ హరిస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. దేహానికి పుష్టినీ, బలాన్నీ కల్గిస్తుంది. కురుపుల్ని మానుస్తుంది. దురద మొదలైన చర్మరోగాల్ని పోగొట్టుంది. వ్యాధికారకసూక్ష్మక్రిముల్ని నాశం చేస్తుంది. కండ్లకు చాలామంచిది. గాయాలను మెత్తపరచి మాన్పుతుంది.

జ్వరంతో వున్నవారు, పిచ్చిపట్టినవారు, మరికొన్ని వ్యాధులుగలవారు ఈ నూనె వాడరాదు.

తిలలు = నూగులు. తిలలనుండి ేసనదే తైలం. కనుక తైల మంటే నూగుల నూనెకే పేరు ఎన్నో ఆరోగ్య గుణాలు తైలంలో వున్నందున ఈ పండుగకే కాదు – ఏ శుభకార్యానికైనా తైలాభ్యంగనం విధిగా చేయాలి.

## నూతనవస్త్రాలు

తమ కిష్టమైన నూతనవస్త్రాలు ధరించడంవల్ల మానసికంగానూ, శారీరకంగానూ ఉత్సాహం, ఆనందం పెల్లుబుకుతుంది. మాసిన పాతదుస్తులు అనారోగ్యకరం. క్రొత్త దుస్తులు ఆరోగ్యకరం. దరిద్రులైనా పండుగనాడు

తలంటి స్నానం చేసి, కొత్తగుడ్డలు ధరించడంతో ఆ రోజైనా తనదరిద్రాన్నీ, కష్టాలనూ మరచి, అందరితో సమానంగా ఆనందాన్ని పొందగల్గుతారు. (అట్లని గొప్పలకుపోయి – మితిమీరి చాలా విలువైనవికొనరాదు) అందరూ సమానంగా సుఖంగా వుండడమనే సమత్వ భావన యిందలి ఆశయం.

## ఇష్ట దేవతాపూజ

సంవత్సరాదినాడు తమతమ ఇష్టదేవతలను పూజించడంతో "ఈసంవత్సరమంతా నాలో దైవానుగ్రహం పుష్కలంగా వుంటుంది. ఏ కార్యమైనా విజయవంతంగా నిర్వహించగల"ననే ధైర్యం, మనోబలం, ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది.

## వేపపూతపచ్చడి

ఉగాదినాడు వేపపూతపచ్చడి (గొజ్జు) తప్పక స్వీకరించాలి. "నింబకుసుమభక్షణం" అని శాస్త్రాలు పేర్కొన్నాయి. "ఉగాది పచ్చడి" అనికూడా అంటారు. ఇది ఒక ఔషధం! శాస్త్రం ప్రకారమైతే "క్రొత్త చింతపండు

తెచ్చి, నీటితో పిసికి, గింజలు, ఉట్లు, తొక్కలు లేకుండా తీసివేసి, చిక్కటిగుజ్జు తయారుచేయాలి. అందులో కాడలు, పుల్లలూ లేకుండా శుభ్రపరచిన వేపపూలూ, అందులో కొద్దిగా బెల్లం వేయాలి. కొద్దిగా నెయ్యివేసి, కలియబెట్టి, దేవునికి నివేదించి, ఉదయాన్నే పరగడుపుననే స్వీకరించాలి.

ఈ వేపపూతను స్వీకరించడంవల్ల నూరేండ్ల ఆయువూ, వజ్రసమానమైన దేహం, సర్వసంపదలూ, చేకూరి, సంవత్సరమంతా సుఖంగా వుంటా రని పెద్దల సూచన.

కొత్తచిత్తపండు బెల్లంలో వుండే దోషాల తీవ్రత ఉగాదినాటికి తగ్గి, అప్పటినుంచీ అవి ఆరోగ్యప్రదాలై, రుచీ, శుచీ కల్గివుంటాయని పూర్వుల నిర్ణయం! ఈనాడు వేపపూత గొజ్జులో శాస్త్రంతో పనిలేకుండా – ఇంకా కొన్ని చేర్చుకొని, ఇదంతా షడ్రుచులకు సంకేత మని సమన్వయించుకోవడం ఆచారమయింది. మామిడి ముక్కలు, ఉప్పు, చెరకు ముక్కలు, అరటిపండ్లు, తేనె కూడా కొందరు కలుపుతారు. కొందరు మిరియాల పొడి

లేదా పచ్చిమిరపకాయముక్కలూ వేస్తారు. మసాలా దినుసులూ వేసేవా రున్నారు.

ఈ 'ఉగాదిపచ్చడి'లో మసాలా దినుసులు, ఉప్పు వాడరాదు.

వసంతఋతుప్రారంభంలో ఆకాలంలో దొరికే వేపపువ్వు, బెల్లం, చింతపండు కలిపి, సేవించడం, రాగలకాలానికి స్వాగతం చెప్పడమే అవుతుంది. మధుర, ఆమ్ల (తీపి, పులుపు) ద్రవ్యాలతో చేర్చి, చేదురసముండే వేపపువ్వును గొజ్జుగా చేసికొని తినడంలో – తియ్యని నోట పండుగపూటా చేదు తినడమేకదా! కాని చేదు వస్తువును తీపు పులుపు పదార్థాలతో కలిపి తినడం, కాలానుగుణంగా ఏర్పడే త్రిగుణాత్మకకష్టసుఖాలనే ద్వంద్వాలకు మేము సంసిద్ధంగా వున్నాం. ఏకాలానికి ఏది వచ్చినా సంతోషంగానే స్వీకరించి, అనుభవిస్తాం" అనే ఒక శపథం చేయడానికి – ఈ పచ్చడిని సేవించడం సంకేతం అవుతుంది.

**వేపపూలు :** వేపపువ్వు చేదుగా, రుచిగా వుంటుంది. శ్లేష్మాన్నీ, క్రిమిరోగాలనూ, పైత్యాన్నీ, కుష్ఠువ్యాధినీ,

పోగొట్టుంది. నాలుకకు రుచిజ్ఞానాన్ని కల్గిస్తుంది. వాతాన్ని హరిస్తుంది. వేపపువ్వును నూనెతోగాని, నెయ్యితోగాని వేయించి, ఉప్పు, కారం కలిపి అన్నంతో స్వీకరిస్తే ఆరోగ్యానికి మంచిది. వేపగాలి, వేపాకులు, వేపనూనె ఇలా వేపసంబంధమైన వన్నీ ఆరోగ్యప్రదాలే!

**బెల్లం :** జ్వరాన్నీ, కడుపునొప్పినీ, ఉదర రోగాలనూ, వాతాన్నీ పోగొట్టుంది. ఒంటిలో నీటిని హరిస్తుంది. నీరసాన్ని తగ్గిస్తుంది. క్రొత్త బెల్లం ఆరోగ్య కారికాదు. కనుకనే ఉగాదితో ఆ దోషంపోతుంది. పాతబడుతుంది. పచ్చడిలో సేవించినందున ఆరోగ్యాన్ని కల్గిస్తుంది. గుండెదడనుకూడా తగ్గిస్తుంది. కడుపులో మంటను తగ్గిస్తుంది. నిద్రపట్టిస్తుంది. (మితిమీరి సేవింపరాదు)

**చింతపండు :** క్రొత్తచింతపండు ఆరోగ్యకరం కాదు. ఉగాదినాటికి చింతపండులో క్రొత్తదనం పోతుంది. ఆనాటినుండి వాడవచ్చు. ప్రాత చింతపండు (కనీసం 2/3 నెలలయినా గడవాలి) ఉష్ణాన్ని తగ్గిస్తుంది. వాతపైత్యశ్లేష్మ రోగాల్ని హరిస్తుంది. బడలికవల్ల ఏర్పడిన

జ్వరాన్ని తగ్గిస్తుంది. హృదయానికి బలాన్ని కల్గిస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. (మంచిదని అధికంగా వాడరాదు)

**నెయ్యి :** ఆయురారోగ్యాల నిస్తుంది. కంటికి మంచిది. జీర్ణశక్తి నిస్తుంది. బుద్ధిబలాన్ని పెంచుతుంది. శరీరానికి కాంతి నిస్తుంది. విషాన్ని హరిస్తుంది. పిచ్చిని తగ్గిస్తుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది. ఓజస్సును పెంచుతుంది. (శక్తి + కాంతి). (మితిమీరి వాడరాదు).

**మామిడి పిందెలు :** వడదెబ్బను హరిస్తాయి.

ఇలా ఎన్నో ఆరోగ్యగుణా లున్న వేపపూతపచ్చడి సేవించడంతో అందలిగుణాలు రక్తంలో కలసిపోయి, సంవత్సరకాలం వాటిప్రభావాన్ని చూపుతాయి. కనుక ఉగాదినాడు తప్పక వేపపూతపచ్చడి సేవించా లని పెద్దలు సూచించినారు.

జ్యోతిశ్శాస్త్రరీత్యా - ఉగాదినాటికి - చైత్రంలో రవి సంచరించే నక్షత్రాలప్రభావం మనుషులపై అధికంగా వుంటుంది. ఈ మాసంలో రవి మేషరాశిలో సంచరిస్తాడు. అశ్విని, భరణి పూర్తి, కృత్తిక ఒకటవ పాదం - మేషరాశి.

అశ్విని – కేతు నక్షత్రం. భరణి–శుక్ర నక్షత్రం. కృత్తిక – రవినక్షత్రం. ఈ నక్షత్రాల అధిదేవతల ప్రభావమూ జీవులపై పడుతుంది. కేతువు కుజునివంటి వాడు. కుజుడు అగ్నిగ్రహం. కేతువూ అంతే! అగ్ని గ్రహమైన రవి, అదే అగ్నికి సమానమైన అశ్వినీనక్షత్రంలో సంచరించుకాలంలో అగ్నిప్రభావం (ఎండవేడి) ఎక్కువగా వుంటుంది. అట్లే భరణి, కృత్తికల్లో రవి సంచరించుకాలం కూడా మంచిదికాదు. అనేకఅనర్థాలకు కారణ మవుతుంది. కనుక ఈ మాసారంభంలో విష్ణువును (శ్రీరాముణ్ణి) పూజించడం, మధురామ్లమిశ్రితమైన వేపపూతను స్వీకరించడంవల్ల మానసికంగానూ, భౌతికంగానూ ప్రశాంతత ఏర్పడుతుంది. ఆరోగ్యం కుదురుగా వుంటుంది. రవిసంచారంవల్ల కలిగే దోషాలు హరిస్తాయి. రోగాలనుండి విముక్తి కల్గుతుంది.

ఉగాదినాడు మఱ్ఱి, మామిడి, నేరేడు, మేడి, జువ్వి (పంచపల్లవాలు) ఆకుల్ని నీళ్ళలో నానబెట్టి, ఆ నీటితో అభ్యంగనస్నానం చేయా లనికూడా అన్నారు. ఇట్టి నీటితో స్నానం చేస్తే కంటికీ, మెదడుకూ చాలా మంచిది.

ఉగాదిపండుగ చాలా ప్రాచీనమైనది. దాదాపు 197 కోట్ల సంవత్సరాల ప్రాచీనత గల పండుగ ఉగాది. భగవద్గీత, ఉగాది పండుగ రెండూ సమానప్రాచీనత కలవి.

## పంచాంగ శ్రవణం

ఉగాదినాటి ముఖ్యాచరణాంశాల్లో వేపపూత పచ్చడి, పంచాంగశ్రవణం అతిముఖ్యమైనవి.

తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం - అనే ఐదు అంగాలు కలది పంచాంగం. ఉగాదినాడు ఆ సంవత్సర పంచాంగాన్ని మహావిష్ణుస్వరూపంగా భావించి, పూజించాలి. పిదప సాయంకాలం పంచాంగశ్రవణం చేయాలి. పంచాంగంలోని అయిదింటికీ ఐదు ప్రయోజనా లున్నాయి. 1) సంపద కోరేవాడు తిథి విషయమై జాగ్రత్త వహించాలి. 2) దీర్ఘాయువు కోరేవాడు వారం విషయంలో 3) పాపవిముక్తి కోరేవాడు నక్షత్రవిషయంలో 4) రోగవిముక్తి కోరేవాడు యోగవిషయంలో 5) కార్యసిద్ధి కోరేవాడు కరణంవిషయంలో - జాగ్రత్త వహించాలి.

అంటే ఏపని చేసినా పంచాంగశుద్ధి - అనగా తిథివార నక్షత్రాదుల శుభత్వం, అనుకూల్యం చూచి, తెలిసికొని ప్రవర్తించాలి. గ్రహనక్షత్రాదుల ప్రభావం తెలుసుకొని ప్రవర్తిస్తే జీవితం సుఖశాంతుల్తో వర్ధిల్లుతుంది. ఇందుకు పంచాంగవిజ్ఞానం చాలా అవసరం.

సంవత్సరాదిలో పంచాంగవిశేషాలు తెలుసుకోవడంవల్ల అన్నిరంగాల్లో తాము ప్రవర్తించాల్సిన విధానాన్ని ఒకసంవత్సరం ముందుగా గ్రహించి, అందుకు తగినట్లుగా కార్యక్రమాలు చేపట్టుట, మానుట అనేది నిర్ణయించుకోవచ్చు. అనంతమైన కాలాన్ని - సంవత్సరమనేప్రమాణంతో గణించి, గ్రహనక్షత్రాది సంచారాన్నీ, వాటిఫలాలనూ గుణించి, గ్రహించి, మానవునికి కర్తవ్యాకర్తవ్యబోధచేయుముఖ్యసాధనం పంచాంగం.

జీవనప్రయాణంలో మున్ముందుగా వచ్చే సుఖదుఃఖాలనే ద్వంద్వాల మజిలీలనుగూర్చి తెలిసికొని, మార్గాన్ని సుఖతరమూ, సులభతరమూ చేసుకొని పురోగమించుటకే పంచాంగశ్రవణం ఏర్పాటైనది.

అన్నివర్గాలవారికీ, దేశాలకూ పంచాంగం ఎంతో ముందుచూపుతో ప్రవర్తించే విధివిధానాలను చూపుతుంది.

కాలవిజ్ఞానాన్నీ, ప్రభావాన్నీ గ్రహించి, మానవులు ధర్మకార్యనిమగ్నులై ప్రవర్తించాలి.

"ధర్మాన్ని మనం రక్షిస్తే - ధర్మమే మనల్ని రక్షిస్తుంది".

(ఈ రచనలో ఎన్నో గ్రంథాలు ఉపకరించాయి. ఆయా రచయితలకూ, ప్రకాశకులకూ హార్దకృతజ్ఞతా నమస్సులు)

"యుగాదికృత్, యుగావర్తః" అయిన మహా విష్ణువుకూ, పాఠకదేవుళ్ళకూ పునఃపునఃనమస్సులు

- పమిడికాల్వ చెంచుసుబ్బయ్య



ధర్మో రక్షతి రక్షితః

ధర్మప్రచార పరిషత్తు

తిరుమల తిరుపతి దేవస్థానములు

ప్రకాశకులు : శ్రీ వి.పి.వి.ఎన్. శర్మ, ఐ.ఏ.ఎస్. కార్యనిర్వహణాధికారి

ముద్రణ : స్టూడెంట్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, తిరుపతి